ఇళ్ల పనుల్లో వేగం పెంచండి



చెంచుపెంటలో పర్యటిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

- నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

హన్వాడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మండలంలోని ఇబ్రహీంబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం దాచక్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుపెంటలో కలెక్టర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో తమకు మంజూరైన ఇళ్లు పూర్తిగా శిథిలమైన విషయాన్ని చెంచులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నిరుపేద చెంచులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్లు నిర్మించుకునేందుకు ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎరువులు, విత్తనాల స్టాక్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు సంబంధించిన రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపీడీఓ యశోదమ్మ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా మహిళాశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, హైదరాబాద్‌కు చెందిన అలింకో ఆర్గనైజేషన్ సౌజన్యంతో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ కోసం వచ్చే నెల 3, 4, 5 తేదీల్లో గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర ఒక ప్రకటనలో తెలిపారు. 3న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, 4వ జడ్చర్ల ఎంపీడీఓ కార్యాలయం, 5న దేవరకద్ర ఎంపీడీఓ కార్యాలయాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శారీరక వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్, చంక కట్టెలు, వీల్ చైర్లు, బధిరులకు వినికిడి యంత్రాలు, అంధులకు చేతి కట్టెలు, బుద్ధిమాంద్యులకు టీఎల్‌ఎం కిట్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాలకు వచ్చే దివ్యాంగులు తప్పనిసరిగా ఆధార్, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం దేవరకద్రలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్ రెడ్డి నివాసంలో మున్సిపాలిటీల నూతన కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనునిత్యం ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి, నాయకులు యజ్ఞ భూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



దేవరకద్ర: మండలంలోని డోకూర్ శివారులో గల వీరేశంగౌడ్ వ్యవసాయ పొలంలో ఎక్సైజ్ అధికారులు గురువారం ఈత మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ వన మహోత్సవంలో భాగంగా 500 ఈత మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని రైతుకు సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐ సుష్మ కసిరెడ్డి, హెచ్‌సీ రహమత్ పాషా, కానిస్టేబుల్స్ తేజశ్రీ, రమేశ్, అంజి, బాలస్వామి పాల్గొన్నారు.

జీలుగ సాగుతో భూసారం



అడ్డాకుల: జీలుగ సాగుతో భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది.. భూసారం పెంపొందుతుందని మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ అన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లిలో గురువారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. 50 శాతం రాయితీపై అందించే జీలుగ విత్తనాలను పోల్కంపల్లి సహకార సంఘంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జీలుగ సాగుతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగడంతో పాటు చౌడు ప్రభావం తగ్గి భూసారం పెరుగుతుందని చెప్పారు. జీలుగ సాగు చేసిన రైతులు ఎకరానికి ఒక యూరియా బస్తా మాత్రమే వేసుకోవాలన్నారు. తద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ

దేవరకద్ర/భూత్పూర్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్లు కృష్ణయ్య, కిషన్ నాయక్ అన్నారు. గురువారం దేవరకద్ర, భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు దీపిక, గీత, ఆర్‌ఐలు శరత్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవాబుపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 2009–2010 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, ప్రకాశ్, వేణు, రాజ్‌కుమార్, రవీందర్, రమ్య, సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి



రాజాపూర్: పేదల సంక్షేమం కోసం తన తనయుడు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ శశికళారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుచ్చర్‌కల్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆమె భూమిపూజ చేశారు. జడ్చర్ల సమీపంలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కుచ్చర్‌కల్ సమీపంలోని పౌల్ట్రీఫాంలో శుభ్రత పాటించక పోవడంతో దోమలు, ఈగల బెడద అధికంగా ఉందని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకురాగా.. సంబంధిత యజమానికి ఫోన్ చేసి మాట్లాడారు. సమస్య ఇలాగే ఉంటే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌గౌడ్, నర్సింహులు, కృష్ణయ్యగౌడ్, సత్యం పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు (డివిజన్ నం.11) లో మురుగు నివారణకు చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ పరిశీలించారు. అంతకుముందు వల్లభనగర్ (డివిజన్ నం.27)లో వర్షాలతో ముంపునకు గురికాకుండా చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



నవాబుపేట: మండలంలోని కూచూర్‌లో నూతన దేవాలయం ప్రారంభోత్సవంతో పాటు దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం వేద మంత్రోచ్చారణల మధ్య హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవతా విగ్రహాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వేద ఘోషతో గ్రామం మార్మోగింది. శుక్రవారం నూతన ఆలయంలో దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నారు. నిర్వాహకులు బోజయ్య, రవి, నారాయణ, సురేశ్, గోపాల్, యాదగిరి, సంతోష్, నర్సింహాగౌడ్, నారాయణ, సంజీవరెడ్డి, నాగిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించాలి’

మహబూబ్‌నగర్ రూరల్: దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఏనుగొండ శివారు సర్వేనంబర్ 435లోగల 6.30 ఎకరాల భూమిలో ఫారెస్టు అధికారులు కందకాలు తీసి.. రైతులకు దారి లేకుండా చేశారన్నారు. ఈ విషయమై ఇదివరకే కలెక్టర్‌ను బాధిత రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ.. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అర్బన్ తహసీల్దార్‌కు ఆదేశించినా ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేయలేదన్నారు. అదే విధంగా సర్వేనంబర్ 431లో ప్రభుత్వ భూమి 40 ఎకరాలు ఉండగా.. మూడు తరాలుగా మాదిగలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఫారెస్టు అధికారులు ఆ భూమిలో మొక్కలు నాటారని తెలిపారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ క్రైం: మహిళల భద్రత, న్యాయ సేవల విషయాల్లో మరింత పారదర్శకత, వేగవంతమైన స్పందన ఉండాలని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు పురోగతిపై సీఐ శ్రీనివాస్‌తో పాటు ఇతర సిబ్బందితో సమీక్షించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళకు న్యాయం జరగాలని.. చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద షీ టీం బృందాలు నిఘా పెంచాలని సూచించారు. ఈవ్ టీజింగ్, వరకట్న వేధింపులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధితులకు ఆత్మ విశ్వాసం కలిగించేలా భరోసా ఇవ్వాలన్నారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ శైలజ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్ల టౌన్/మహమ్మదాబాద్/మిడ్జిల్: ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక, టీఎస్‌యూటీఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ప్రచార జాత గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, మంచి వాతావరణం ఉండటం వల్ల విద్యార్థులు చదువులు బాగా చదివేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగా ఆంగ్ల బోధన కూడా జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. అనంతరం ప్రచార జాత జడ్చర్ల నేతాజీ చౌరస్తాకు చేరింది. అంతరాలు లేని బడి కోసంతెలంగాణ పౌరస్పందన వేదిక ద్వారా ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు నర్సిరెడ్డి తెలిపారు. అక్కడి నుంచి మిడ్జిల్ మండలం చిల్వేర్‌కు ప్రచార జాత చేరుకోగా.. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. అంతకుముందు మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం, జిల్లా కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి మన్యం, నాయకులు అజయ్, హేమంత్, కృష్ణ, వెంకటయ్య, నర్సింహులు, రమేశ్, నరేశ్, మల్లస్వామి, నజీర్, ప్రమోద్‌రెడ్డి, పుల్లారెడ్డి, ప్రభావతి, శ్యామల కుమారి, కవిత, కృష్ణయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



జడ్చర్ల మార్కెట్‌లో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల/రాజాపూర్/మిడ్జిల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి వరిధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. గురువారం జడ్చర్ల పత్తి మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు రాజాపూర్ మండలంలోని చెన్నవెల్లి, తిర్మలాపూర్, బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, సూరారం, చిన్నరేవల్లి, మిడ్జిల్ మండలంలోని చిల్వేర్, రాణిపేట, మున్ననూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని చూశారు. అయితే వర్షాలు కురుస్తున్నందున ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేకుండా పోతుందని ఈ సందర్భంగా రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ స్పందిస్తూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు జడ్చర్ల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. జూన్‌లో ఒకేసారి మూడు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం సరఫరా ఉన్నందున.. సకాలంలో రేషన్ దుకాణాలకు బియ్యాన్ని సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బియ్యం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. రేషన్ బియ్యం సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీఎస్‌ఓ శ్రీనివాస్, డీఎం రవినాయక్, తహసీల్దార్లు నర్సింగ్‌రావు, రాధాకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, డీటీ బాలప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం

మహమ్మదాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. మిల్లర్లు తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే సహించమని తహసీల్దార్ హెచ్చరించారు. తూకంలో ఎలాంటి కోతలు విధించవద్దని నిర్వాహకులకు సూచించారు.

ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుపై సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జడ్చర్ల: పట్టణ సమీపంలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తంచేస్తూ గురువారం సంబురాలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం.. లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

భూత్పూర్: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ భరత్ భూషణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.కళ్యాణి, దేవరకద్ర ఏడీఏ ఎస్.రాజేందర్‌లతో కలిసి ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు పంట మార్పిడి విధానంపైపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంటసాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి.. పచ్చరొట్ట, వర్మీకంపోస్టు ఎరువులు వినియోగించాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు పప్పు దినుసుల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సాగునీటిని ఆదా చేయడానికి తుంపర సేద్యంపై దృష్టి పెట్టాలని, వరిలో వెదజల్లే విధానం పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, హార్టికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్, సెరికల్చర్ ఆఫీసర్ జనార్దన్, మండల పశుసంవర్ధక శాఖ అధికారి డా.మధుసూదన్, ఏఈఓలు ప్రసాద్ బాబు, ప్రదీప్, ప్రశాంతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. గురువారం ఐదో వార్డులో మున్సిపాలిటీ నిధులు రూ. 4లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం రెండో వార్డులో 12మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా హౌసింగ్‌బోర్డు కాలనీలో కౌన్సిలర్ దోరేపల్లి లక్ష్మి 8 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కౌన్సిలర్లు బుక్క మహేశ్, నవనీత, దేవా, ఏఈ గాయత్రి, వార్డు అధికారి శివ, నాయకులు నందకిషోర్, వెంకటేశం నర్సింహులు, రామ్మోహన్, కొండల్, నర్సింహ యాదవ్, సంతోష్ ఆచారి, జగన్, ఇందిరమ్మ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

భూత్పూర్: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ అన్నారు. గురువారం మండలంలోని తాటిపర్తి, తాటికొండ, హస్నాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు 8 వారాల కూలి డబ్బులు చెల్లించ లేదన్నారు. ఇందుకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, ఫీల్డ్ అసిస్టెంట్లు కేశవులు, లింగంగౌడ్, శివలీల, ఆంజనేయులు, హన్మంతు పాల్గొన్నారు.

‘వరంగల్‌కు తరలిరావాలి’

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 31న వరంగల్‌కు రానున్నారని.. ఆయనకు ఘన స్వాగతం పలకడానికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని ఆ సంఘం జిల్లా నాయకుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి మందకృష్ణ మాదిగ ఊరేగింపుగా కాళోజీ కళాక్షేత్రానికి చేరుకుంటారన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సులో ఆయన పాల్గొంటారని చెప్పారు. జిల్లాలోని కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో వరంగల్‌కు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జె.బాలరాజు, ఆంజనేయులు, రమేశ్, రాజు తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కాకర్జాలతండా, కాకర్జాల, రంగంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తులసీరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, సంతోష్ నాయక్, సత్యం, నర్సింహ, రాము, లక్ష్మణ్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విఠల్‌రావు వర్ధంతిని మరిచిన కాంగ్రెస్ పార్టీ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎంపీ, బీసీల ముద్దుబిడ్డ దేవరకొండ విఠల్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మరిచిపోవడం బాధాకరమని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడూ కీలకమైన పీసీసీ కోశాధికారిగా ఆయన ఉంటూ.. సొంత డబ్బును ఖర్చుపెట్టి పార్టీని కాపాడి అధికారంలోకి తీసుకొచ్చిన విఠల్‌రావు వర్ధంతిని మరిచిపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా పనిచేస్తున్న కాలంలోనే విఠల్‌రావు అప్పన్నపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి తన జీవిత కాలం సేవలు అందించిన విఠల్‌రావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను భవిష్యత్‌లో అయినా నిర్వహించి బీసీ బిడ్డను గౌరవించాలని కోరారు.

కొనసాగుతున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్

మహబూబ్‌నగర్ క్రీడలు: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి పాలమూరు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం కొనసాగాయి. శుక్రవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్లీపూర్ విద్యార్థులు

చిన్నచింతకుంట: మండలంలోని అల్లీపూర్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం వనపర్తి జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో టి.అశ్విని, టి.సుచిత్ర, డి.అర్జున్, ఎస్.సాయికిరణ్, కె.గణేశ్, డి.కురుమూర్తి, నరేశ్ వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. వారిని వచ్చే నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ నవీన్ తెలిపారు.

అలరించిన నృత్య పోటీలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ధూమ్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో గురువారం స్థానిక మోనప్పగుట్ట మౌనేశ్వరస్వామి ఆలయ ఆడిటోరియంలో నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, చిన్నారులు ప్రదర్శించిన సోలో, వెస్ట్రన్, క్లాసికల్ డాన్స్ అలరించాయి. దివ్యాంగుడు అరుణ్ ప్రదర్శించిన డాన్స్‌కు ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు. అనంతరం దాదాపు 220 మంది చిన్నారులు, యువతతో పాటు 12 మంది డాన్స్ మాస్టర్లకు ధూమ్ డాన్స్ స్టూడియో డైరెక్టర్ ఎ.అజీమ్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో చంద్రముఖి శేఖర్, లక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా.. లక్ష్మణ్, మమత, శ్రీదేవి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో పేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాలను కేటాయించాలని గురువారం తహసీల్దార్ సుందర్‌రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 435ఏలో ఉన్న భూమిని ప్రభుత్వం సేకరించినట్లు తెలిపారు. మొత్తం 206 మంది పేదలకు ఆ భూమిలో ప్లాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో డబ్బులు తీసుకున్న వారు ఆ భూమి తమదని పేర్కొంటూ సాగుచేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేబీఆర్ గౌడ్, నీలి ఆంజనేయులు, షేక్ అబ్దుల్ జాంగీర్, కుర్వ రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కాకతీయ స్కూల్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా చౌదర్‌పల్లి శివారులోనే ఆటో, కారు ఢీ కొనడంతో పలువురికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.